# ఉన్నమాట

-వసుంధర



**ఆషాఢమాసం** పెళ్ళయిన తొలి ఏడు మాత్రం-అదీ ఓ నెల రోజులు ఆలు మగలను బాధిస్తుంది. మా పాలవాడు మాకు ప్రతిరోజూ ఆషాఢ మాసాన్ని గుర్తుచేస్తాడు. తెల్లవారుఝామున ఆహ్లాదకరమైన చలిలో ఒకరి కొకరు హత్తుకుని అపురూపమైన ఆ వెచ్చదనం కలిగించిన మత్తులో ఆదమరచి నిద్రపోతున్న సమయంలో మాపాల వాడు కాలింగ్ బెల్ మ్రోగిస్తాడు. శ్రీమతి పక్కలోంచి లేస్తుంది. నా నిద్ర తేలిపోతుంది. విశ్వామిత్రుడి తపో భంగానికి మించిన బాధ అది!

కానీ అనుభవించక తప్పదు. ఆ క్షణంలో నిద్ర, ప్రేయసి సాన్నిధ్యం ఎంత ముఖ్యమో ఓ గంట తర్వాత కాఫీ కూడా అంత ముఖ్యం నాకు.

ఆ రోజు కూడా శ్రీమతి నా నిద్ర తేలగొట్టేసింది.

"పాలు మరీ పల్చగా ఉన్నాయి" అంది శ్రీమతి పాల వాడితో.

"ఏం చేస్తానమ్మా-ఈ గవర్నమెంటు ఉద్యోగులూ, మా పాడి గేదెలూ- ఒక్కలాగే ఉంది వ్యవహారం..." అన్నాడు పాలవాడు.

మా పాలవాడు చాలా తిరకాసుగా మాట్లాడతాడు. అయినా ఈమధ్య జంధ్యాల, సత్యానంద్ వగైరాలు సినిమాడైలాగులు రాయడం మొదలెట్టేక అడ్డమైన వాళ్ళూ సినిమాలు చూసి తిరకాసుగానూ, తెలివిగానూ మాట్లాడ్డం నేర్చుకున్నారు.

"నీ పాలు పల్చగా ఉంటే మధ్య గవర్నమెంటు ఉద్యోగు లేం చేశారు?"

"వాళ్ళేం చేయలేదమ్మా-పోలిక్కి చెప్పాను. దాణా ఎంత పెంచినా నా గేదెల పాలు పలచన...జీతా లెంత పెంచినా వాళ్ళ పని పలచన..."

చటుక్కున లేచి కూర్చున్నాను. వాడికి నేను కేంద్ర ప్రభుత్వోద్యోగినని తెలును.

శ్రీమతి లోపలకు రాగానే-"త్వరగా పాలు పోయించుకోక వాడితో ఆ కబుర్లేమిటి?" అన్నాను.

"మీ క్కోవం వచ్చినట్లుందే?" అంది శ్రీమతి.

"కోపమెందుకు?" అన్నాను.

"ఎందుకో ఏం చెప్పగలను? కానీ ఓ విషయం నాకు తెలుసు..." అంది శ్రీమతి.

పాలు పల్చగా ఉన్నాయంటే మా పాలవాడికి కోపం రాదుట. పాలు పల్చగా ఉంటే అది పాలిచ్చిన గేదె తప్పే అవుతుంది. పాలలో బాగా నీళ్ళు కలిపేస్తున్నావ్ అంటే వాడికి చాలా కోపం వస్తుందట.

"కారణం తెలుసా?" అంది శ్రీమతి. నేను తల అడ్డంగా తిప్పగానే "ఎవరికైనా ఉన్న మాటంటేనే ఉలుకు... " అని లోపలకు వెళ్ళిపోయిం దామె.

ఉదయం లేచీ లేవగానే ఇద్దరిచేత అవమానించబడ్డాను. లేచిన వేళ మంచిది కాదనడానికింతకంటే నిదర్శనమేం కావాలి?

ఆఫీసులో నాకు బొత్తిగా పని లేదన్న నమ్మకం శ్రీమతిలో ఎంత బలంగా ఉందంటే, పాలవాడు ప్రభుత్వోద్యోగుల మీద జోక్ చేయడానికి తనే కారణమని నా నమ్మకం. మాపిల్లలు కూడా అంతే! వాళ్ళు ఆదివారాలు నన్నే సాయమూ అడగరు. ఆఫీను ఉన్న రోజుల్లో హోమ్ వర్కునీ, అదనీ, ఇదనీ నా చుట్టూ చేరి ప్రాణాలు తీస్తారు. నేను విసుక్కుంటే "అదేమిటి, నాన్నా! ఈ రోజు ఆఫీను కెళ్ళి వచ్చారుగా... అయినా విసుక్కుంటారేం?" అంటారు.

నే నాఫీసుకు వెళ్ళడమంటే ప్రత్యేకమైన విశ్రాంతి తీసుకోవడమే అన్న తిరుగులేని అభిప్రాయం వాళ్ళది. అది పోగొట్టడానికి నే నెన్నో ప్రయత్నాలు చేసి. గృహ రంగంలో భార్య సహకారం లేనిదే భర్త ఏమీ సాధించలేడన్న కఠోర సత్యాన్ని- తెలుసుకున్నాను. నేను తెలుసుకున్న మరో కఠోర సత్యం- భార్యాభర్తల పరస్పర సహకారానికి అర్థం భార్య అభిప్రాయానికి భర్త తలవంచడం అని!

నేను వెంటనే మంచం మీంచి లేచిపోలేదు. ఇప్పుడు శ్రీమతి పిల్లల్ని లేపేసింది. వాళ్ళు నా కంటే రెండు గంటల ముందుగా స్కూలుకు వెళ్ళాలి. అందుకని బాత్రూమ్. టాయ్‌లెట్- ఏదీ నాకు అందుబాటులో ఉండదు. అందుకే ముందుగా న్యూస్ పేపరు చదువుకుంటాను. ఇప్పుడూ అదే చేసి ముఖం కడుక్కుని, కాఫీకోసం వంటింట్లోకి వెళ్ళాను. అక్కడ తల్లీ బిడ్డలు పాలవాడి జోక్ చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

"లేచినప్పట్నుంచీ ఇంకే పనీ లేదా...దానిగురించి ఎంత సేపు మాట్లాడుకుంటారు?" అన్నాను.

"ఎంత సేపో మాట్లాడుకుందుకు మీకులా మాకు తీరుబడేదీ? అందరికీ అన్ని పనులూ అయ్యేసరికి ఇప్పుడే కాస్త తీరుబడైంది..." అంది శ్రీమతి.

ఆ ఇంట్లో అందరికంటే కష్టపడుతున్నది నేనే అని నా నమ్మకం. ఆకాశవాణి వార్తలనైనా నమ్ముతుంది, కానీ, నా మాట నమ్మదు శ్రీమతి. ఉన్న మాటను యథాతథంగా చెప్పే నమ్మకమైన యంత్రం దొరికితే తప్ప శ్రీమతిని నమ్మించలేను.

యంత్రం సంగతలా ఉన్నా పిల్లలు స్కూలుకు వెళ్ళిన అరగంటకి యంత్రంలాంటి మనిషి మా ఇంటి కొచ్చాడు.

నేను బాత్రూమ్‌లో ఉండగా కాలింగ్ బెల్ మోగింది. శ్రీమతి వెళ్ళి తలుపు తీసి-"మా అయిదేళ్ళ బాబయ్య వచ్చాడండీ" అంటూ నాక్కూడా వినబడేలా కేక పెట్టింది. త్వరగా తెమిలి రమ్మని నాకు హెచ్చరిక.

అయిదేళ్ళ బాబయ్య అనగానే హడలిపోయాను. ఆయన అసలు పేరేమైనా ఇంట్లో ఆ పేరే స్థిరపడిపోయింది. ఆయన బాగా పేరున్న రాజకీయ నాయకుడు. ఎలక్షన్ల సమయంలో తప్ప ఆయన బంధుమిత్రుల్ని కూడా చూడరు. అందుకే ఆయన కా పేరు వచ్చింది. ఆయన ఎప్పుడూ కూడా ఎన్నికల్లో స్వతంత్రుడుగా నిలబడతాడు. ప్రభుత్వాన్ని తిడతాడు. ఎన్నికలయ్యాక అధికార పక్షంలో చేరుతాడు. చిన్నదో, పెద్దదో మంత్రి పదవి సంపాదిస్తాడు. నాలుగు డబ్బులు మిగుల్చుకుంటాడు. ఎన్నిక లొచ్చే ముందు అధికార పక్షంతో గొడవ పెట్టుకుని, పదవికి రాజీనామా చేస్తాడు. తను ప్రజా సేవ చేయడానికి అధికార పక్షం సహకరించడం లేదంటాడు. అందుకే పదవిని త్యాగం చేశానంటాడు. మళ్ళీ ఎన్నికల్లో స్వతంత్రుడుగా పోటీ చేస్తాడు. మళ్ళీ మంత్రిపదవి సంపాదిస్తాడు.

ఇలా చాలాసార్లు జరిగింది.

ఆయన్ని యంత్రంలాంటి మనిషని ఎందుకన్నా

MCA-MCS-52-TEL




తయారు చేసినవారు: కర్నాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్. మార్కెట్ చేయువారు: మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.

నంటే, మనిషి ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు-ఆఖరికి ఉన్న మాట అన్నప్పుడు కూడా!

ఆయనంటే నాకు చాలా భయం. ఎందుకంటే. ఉన్న మాటనడం నాకు చేతకాదు. నేను నా ఓటుకూడా పెళ్ళాం చెప్పిన వాళ్ళకే వేస్తానని తెలి సికూడా ఆయన నాకు తన రాజకీయ ఆశయాలూ,విధానాలూ చెప్పి నన్నూదరకొట్టేస్తాడు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్నది ఆయన సిద్ధాంతం.

"ఒకోసారి ఆరే సి నెలలకే మళ్ళీ ఎన్నికలొచ్చేస్తున్నాయి. ప్రభుత్వాలకి బొత్తిగా నిలకడ లేకుండా పోయిన ఈ రోజుల్లో కూడా నన్నయిదేళ్ళ బాబాయనడం బాగోలేదమ్మా" అన్నా డయిదేళ్ళ బాబాయి శ్రీమతి ఏ స్వరంలో అందో అదే స్వరంలో. అంటే, తను ఎన్నికల గురించే వచ్చానని నాకూ. శ్రీమతికీ కూడా నిర్మొహమాటంగా చెబుతున్నాడన్న మాట!

నేను వెళ్ళేదాకా ఆయన శ్రీమతిని వదలడు. అందువల్ల పను లాలస్య మవుతాయి. కాబట్టి ఇష్టం లేకున్నా త్వరగా స్నానం ముగించుకుని ఆయన వద్దకు వెళ్ళి కసాయి వాడి ముందు గొర్రెలా తల వంచాను.

అయితే ఈ సారి ఆయన ధోరణిలో చాలా మార్పు వచ్చింది. ఆయన మనిషి బాగా దిగులుగా ఉన్నాడు-"ఎప్పుడూలేని దీ సారి అధికార పక్షం తరఫున పోటీ చేస్తున్నానోయ్. ఇలాంటి ప్రచారం నాకు బొత్తిగా సరిపడదు. ఎక్కడ మాట్లాడుదామన్నా నా పార్టీకి వ్యతిరేక భావాలే వచ్చేస్తున్నాయ్..."

"అలా ఎందుకు చేశారు?"

"రాజీవ్ గాంధీ వచ్చి యాంటీ డిఫెక్షన్ లా పెట్టేశాడుగా. ఇండిపెండెంటుగా నిలబడితే నెగ్గక పార్టీ మారడానికి లేదు. పార్టీ మారకపోతే మంత్రిపదవి రాదు. మంత్రి పదవి లేకపోతే నేను బ్రతకలేను..." అన్నా డయిదేళ్ళ బాబయ్య.

"అయితే ఇప్పుడేం చేస్తారు?" అన్నాను.

"ప్రచారానికి నన్ను వెళ్ళొద్దని అంతా అంటున్నారు. ఇంతవరకూ నేను ప్రజల కేమీ చెయ్యలేదు. అదో పెద్ద విశేషం కాదు. ఏ పదవీ లేకుండా ప్రజల కెన్నో చే సిన జనార్దనాచారి నా మీద పోటీ! ఆయనంటే ప్రజల్లో చాలా గౌరవం. ప్రజల కే ఎందుకు. నాకూ గౌరవమే ఆయనంటే! ఉన్నప ళంగా ఆయన ఇలా ఎన్నికల్లోకి వచ్చేస్తాడని నేననుకోలేదు. నా వల్ల బొత్తిగా ప్రజల కేమీ జరగడం లేదని మనసు పాడైపోయి. ఆ ఆవేదనతో ఆయన ఎన్నికల్లో దిగాట్ట! అయినా. అనుచరులూ ప్రజా సేవ చేయడానికి నాకు బోలెడు అవకాశాలొచ్చాయనీ, ఒక్కటీ ఉపయోగించుకోలేదనీ ఉదాహరణలతో సహా కొట్టేస్తున్నారు. జనా లేమో అది విని చప్పట్లు కొట్టేస్తున్నారు. అంతా అంటున్నారూ-జనా లెన్ని చప్పట్లు కొట్టినా. ఓట్లుమాత్రం మా నాయకుడికే పడతాయని! అందుకే ప్రచారం మా నాయకుడికే వదిలిపెట్టి నన్నో మూల కూర్చోమంటున్నారు. హేమాహేమీలనే నా ప్రచారంతో ఓడించాను. ఎన్నికల సమయంలో అధికార పక్షాన్ని దుయ్యబట్టడం తప్ప మరోటి నాకు చేతగాదు. అందువల్ల నా ప్రచారమే నేను చేసుకోలేకపోతున్నాను. ఈసారి ఓడిపోతానేమో అని భయంగా ఉంది..."

చాలాకాలం తర్వాత ఆయనకు ధైర్యం చెప్పే అవకాశం వచ్చింది కానీ. నే నది ఉపయోగించుకోలేదు. అవతల ఆఫీసుకు టైమైపోతోంది నాకు.

మా పెద్ద బా సి పేరు నర సింహం. అందరూ ఉగ్ర నర సింహం అంటారు. రోజూ ఆయన చేత చీవాట్లు తినని క్షణ ముండదు. ఇది భరించలేక మొత్తం స్టాఫంతా కలి సి యాజమాన్యానికి ఆయన ప్రవర్తనగురించి రెండు రోజుల క్రితమే ఫిర్యాదు చేశాం. ఆ విషయమై దర్యాప్తు జరగబోతోంది. అలాంటప్పు డాఫీసు కాలస్యంగా వెళ్ళేమంటే కొంప మునిగిపోతుంది. మాపాయింట్ వీకై పోతుంది.

అందుకని మొహమాటాన్నీ, ఆకర్షణనూ జయించి ఆఫీసుకు టైముకే వెళ్ళడానికి ప్రయత్నించాను. అయినా అయిదు నిమిషా లాలస్యమైంది. అయిదు నిమిషాల ఆలస్యం క్షమించతగ్గదే ...కానీ ఆఫీసులో అప్పటికి ప్యూన్ తప్ప ఒక్క పిట్టకూడా లేదు. నా గడియారం తప్పు తిరిగిందా, ఈ రోజు సెలవు దినమా,లేక బా సికు ఉద్వాసన చెప్పేశారా-ఇలాంటి రకరకాల ఆలోచనలు బుర్రలో తిరుగుతూండగా ప్యూన్ నన్ను సమీపించాడు. అప్రయత్నంగా వాడి వంక చూశాను.

"ఇతడి నేరాలకు ప్రభుత్వం విధించిన శిక్షను నా వృత్తి ధర్మంగా అమలు చేస్తున్నాను. నాకితడిపై పగ లేదు. భగవంతుడా! ఈ నా చర్యను పాపంగా పరిగణించకు" అని ఉరి తీ సే వాడు ముందుగా దైవ ప్రార్థన చేసుకుంటాడట. అదే ప్రార్థన మాప్యూన్ కళ్ళలోంచీ కనిపిస్తూంది. అతడెప్పుడు మమ్మల్ని పిలిచినా అదో పెద్ద శిక్షకే దారి తీయడం అందుకు కారణం. ఆశ్చర్య మేమంటే. ఇప్పు డతడి చూపుల్లో అలాంటి భావ లేదు.

"అంతా కాన్ఫరెన్స్ రూమ్‌లో ఉన్నారండి" అన్నా డతడు.

నేనూ కాన్ఫరెన్స్ రూమ్‌కు వెళ్ళాను. నేను వెళ్ళి కూర్చునేసరికి అక్కడ కోలాహలం ఆగిపోయింది. మాకెదురుగా ముందుగా పెద్ద బల్లకు వెనుకగా కూర్చుని ఉన్న నర సింహం అప్పుడే లేచి నిలబడి గొంతు సవరించుకున్నాడు.

"డియర్ ఫ్రెండ్స్! మీ రంతా నాకు వ్యతిరేకంగా యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. తప్పు మీలో ఉందనుకుని నేను మిమ్మల్ని తీవ్రంగా శా సిస్తున్నాను. తప్పు నాలో ఉందనుకుని మీరు నా పై ఫిర్యాదు చేశారు. మనలోని తప్పొప్పులు మనకంటే యంత్రాలు బాగా నిర్ణయించగలవని యాజమాన్యం నిర్ణయించి ఉన్న మాట చెప్పగల ఈ మినీ కంప్యూటర్ల నిచ్చారు..." అంటూ పాకెట్ కాల్క్యులేటర్‌లాంటి చిన్న వస్తువును చూపించి-"మనం మాట్లాడుకుంటున్నప్పుడు దీని స్విచ్ ఆన్ చే సి మాటలు పూర్తికాగానే రీజన్ స్విచ్ నొక్కితే న్యాయం ఎవరి తరఫున ఉందో అక్షరాలలో డి స్ప్లే చేస్తుంది. అయితే సరాసరి ఈ యంత్రాలను ఉపయోగించలేం కాబట్టి కొంతకాలం వీటిని పరీక్షించి, వీటి ప్రయోజనాలను సమీక్షించాల్సి ఉన్నది..." అన్నాడు.

అవి మొత్తం అయిదు మినీ కంప్యూటర్లు. ఒకటి బా సి తన దగ్గ రుంచుకున్నాడు. మాలో సినియర్స్‌కు నాలు గిచ్చాడు. నాకూ ఒకటి వచ్చింది.

తరవాత ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయాం. ఆ రోజు మామూ లుగానే నర సింహం ఉగ్రనర సింహంలా ప్రవర్తించాడు. అన్నిమార్లూ కూడా కంప్యూటర్ తప్పు ఆయనదే అని చెప్పింది. ఆయన బాగా దెబ్బతిన్నాడు. మనిషి నీరసంగా కూడా అయిపోయాడు.

ఇంక ఆఫీసులో కూడా ఈ మినీ కంప్యూటర్లు కోతికి కొబ్బరికాయ దొరికినట్లుగా ఉన్నాయి. ఏదో టైములో ఏదో విషయం చర్చిస్తూనే ఉంటాం గదా... అప్పు డెవరిదో ఒకరిది పైచేయి అవుతూ ఉంటుంది. ఇప్పు డా బాధ లేకుండా ప్రతి సమస్యనూ కంప్యూటర్ పరిష్కరించేస్తోంది.

ఈ విధంగా మేము చాలా సమస్యలు పరిష్కరించాం. హేమమాలిని ఇంకా సినిమాల్లో నటించవచ్చుననీ, బికినీలు కూడా వాడవచ్చుననీ కంప్యూ




ఉత్త ఆకులు కొత్త పోకుల
నర్తకులుగా రాణ కెక్కెను...
సంతసాల ప్రవర్తకులుగా
చూతశాఖలు కంఠమెత్తెను
గరిక పచ్చల మణులు సెలవని
తల్లి గుండెల దూరిపోయెను...
నదుల కలలకు అలల నెత్తుక
కడలి ఒడిలో చేరిపోయెను...
నిన్నవర కొక మొద్దు నిద్దర
కదల నివ్వని గున్న మామిడి
సంతరించిం దెంతో ప్రేముడి!
పాటగా శృంగార రసభర
నాట్యకోలాహల హృదంతర!
కొత్త ఆమని పరవశించిన
కొత్త కామన లెత్తె కొమ్మల...
మెత్తమెత్తని పరిమళాలకు
కన్ను లెత్తెను పడతి మల్లిక!
అంతటా శోభోత్సవముగా
తరలి వచ్చే నుగాది వేకువ!

-సోమసుందర్

టర్ తేల్చింది. బార్లకు వెళ్ళడం తప్పుకాదని కంప్యూటర్ తేల్చింది. ఆఫీసుకు సెలవు పెట్టాలన్నా, ప్రావిడెంట్ ఫండ్ లోంచి లోన్ తీయాలన్నా అబద్ధపు కారణాలు చెబితే అది తప్పుకాదని కూడా కంప్యూటర్ చెప్పింది. ఎప్పుడైనా, ఎవరైనా అడ్డ దిడ్డం వాదనలు చేస్తుంటే అది 'ఇల్లాజికల్' (తర్కరహితం) అని గోల పెడుతుంది. ఆఖరికి మా ఆఫీసులో పనిచేసే ముగ్గురు ఆడపిల్లల్లో ఎవరు ఎక్కువ అందగత్తె అన్నది నిర్ణయించడానికి్కూడా కంప్యూటర్ వాడాం. వాళ్ళ సొగసులను వర్ణించి రీజన్ బటన్ నొక్కితే-"మోర్ డిటెయిల్స్ ప్లీజ్!" (ఇంకా వివరాలు కావాలి) అంది. ఎంత వర్ణించినా ఇంకా వివరాలు కావాలంటూంటే విసిగిపోయి, ఉన్న వివరాలతోనే అందచందాలు తేల్చి చెప్పమన్నాం. అప్పు డది-"డాటా ఇన్ సఫిషెంట్" (సమాచారం చాలదు) అని తేల్చేసింది.

ఈ మినీ కంప్యూటర్ చేతిలో ఉంటే ప్రపంచ సమస్యలన్నీ పరిష్కరించేయ వచ్చునని పించింది. ఉన్న మాటను ఇంత చక్కగా చెప్పగల యంత్ర ముండటం మనిషి అదృష్టం!

మధ్యాహ్నం నేనూ, నా కొలీగ్ శేషగిరీ ఆఫీసు ఎదురుగా ఉండే హొటల్‌కు వెళ్ళి వన్ బై టూ కాఫీ ఆర్డ రిచ్చాం. ఈ హొటల్లో వన్ బై టూ కాఫీకి ఒకటిన్నర కాఫీ ఛార్జి చేస్తున్నాడు. రెండు కప్పులు వాడాలి, రెండు కప్పులు కడగాలి, కాఫీ కూడా కాస్త ఎక్కువే ఉంటుందన్నది హొటల్ వాడి వాదన. ఈ యంత్రం సాయంతో వాడికి బుద్ధి చెప్పాలనుకున్నాం. కానీ యంత్రం మాకే బుద్ధి చెప్పింది. హొటల్‌వాడా కంప్యూట ర్నోసారి అడిగి తీసుకుని ముద్దుపెట్టుకుని-"ఇవెక్కడ దొరుకుతున్నాయో చెప్పండి, సార్-మా హొటల్ వాళ్ళందరికీ ఆర్డ రిచ్చేస్తాను" అన్నాడు.

"ఈ రోజు నుంచి హొటల్ మార్చేద్దాం. దీన్ని మాత్రం ఇంకెప్పుడూ వాడద్దు" అన్నాడు శేషగిరి నాతో.

ఆ రోజు ఇంటికి వెళ్ళాను. అయిదేళ్ళ బాబయ్య లేడు. రెండ్రోజుల తర్వాత మళ్ళీ వస్తానని ఆయన ఇంకెవరో బంధువు లింటికి వెళ్ళారట. శ్రీమతి నాకోసం ఎదురుచూస్తోంది. మావీధిలోని ఆడవా ళ్ళందర్నీ మహిళా సమాజంలో చేర్పడానికి ఓ గొప్పావిడ వచ్చిందట. ఆ విషయమై ఏం చేయాలన్నది ఈ రోజు ఆడాళ్ళందరూ కలిసి మాట్లాడుకుని నిర్ణయించాలిట. ఇంకో అరగంటలో మా ఇంటికి రెండి ళ్ళవతల ఇంట్లో సమావేశం.

నేను శ్రీమతికి మినీ కంప్యూటర్ గురించి చెప్పాను.

"అయితే ఇది తీసుకుని వెడతానండీ-అక్కడ గొప్పగా కూడా ఉంటుంది" అంది శ్రీమతి. సరే అని నే నది ఆమె కిచ్చాను.

అప్పటికే పిల్లలు స్కూలునించి వచ్చి ఆడుకుందుకు బయటకు వెళ్ళిపోయారు. శ్రీమతికూడా వెళ్ళిపోయింది. నే నిచ్చిన మినీ కంప్యూటర్ శ్రీమతి కెంత గొప్ప పేరు తెస్తుందో అని ఆలోచిస్తూ కూర్చున్నాను. వెళ్ళిన అరగంటకే శ్రీమతి తిరి గొచ్చేసింది.

"ఏమిటి కబుర్లు?" అన్నాను.

"భలేదే ఇచ్చారైండి. అక్కడ నలుగురిలోనూ నాకు చచ్చేటంత అవమానమైంది. దీని మూలంగా అందరికీ మనసులు పాడైపోయి సమావేశం రేపటికి వాయిదాపడింది. ఇంకెప్పుడూ ఇది తీసుకెళ్ళను" అంది శ్రీమతి ఉక్రోషంగా.

"ఏం జరిగింది?" అన్నాను.

"ఇల్లాజికల్...ఇల్లాజికల్... అని మాలో ఎవ్వరేం మాట్లాడినా ఒకటే గోల ఇది. మే మంత అర్థం లేకుండా మాట్లాడతామా?" అంది శ్రీమతి. ఆమెకు కళ్ళ నీళ్ళ పర్యంతమైంది.

"ఉన్న మాటంటే అలాగే ఉంటుంది మరి!" అన్నాను.

ఆ రాత్రి పిల్ల లింటికి వచ్చేక వాళ్ళకీ మినీ కంప్యూటర్ గురించి చెప్పాను. దాన్ని పరీక్షించడానికి వాళ్ళు చాలా కుతూహలపడ్డారు. కంప్యూటర్ ఆన్ చేసి ఇంట్లో ఎవరెవ రేం పనులు చేస్తున్నదీ చెప్పి, రీజన్ బటన్ నొక్కాం. కంప్యూటర్ లెక్కప్రకారం "అందరికంటే ఎక్కువగా శ్రీమతి కష్టపడుతోంది. తర్వాత అమ్మాయి. తర్వాత అబ్బాయి. నా విషయంలో 'బిలో యావరేజ్' (సరాసరికంటే దిగువ)" అని చూపించింది.

పిల్లలు వెంటనే ఆనందంగా చప్పట్లు కొట్టారు. శ్రీమతి సంతోషంగా-"అప్పుడప్పు డిదీ బాగానే పనిచేస్తుందన్న మాట!!!" అంది.

"ఎప్పుడూ ఒకేలా పనిచేస్తుం దిది. నీ విషయంలో ఇది చెప్పే దేంటంటే-పని బాగానే చేస్తావుగానీ, అర్థంలేకుండా మాట్లాడతావని!" అన్నాను.

శ్రీమతి మూ తి మూ డు వంకరలు తిప్పింది. అప్పుడు నా కింకో కుతూహలం కలిగింది. ఏకాంతంలో కంప్యూటర్ వద్ద శ్రీమతిని వర్ణించాను. శ్రీమతి గురించి ఎన్ని వివరా లివ్వడానికైనా అభ్యంతరం లేదుకదా! అంతా అయ్యాక కంప్యూటర్ ఆమెను కూడా 'బిలో యావరేజ్' అంది. అది తెలిసి శ్రీమతి కోపంగా నన్ను వర్ణించింది. "యు డిజర్వ్ బెటర్ హజ్బెండ్" (నీకింత కంటే మంచి మొగుడు దొరకాలి) అంది కంప్యూటర్. ఎందుకీ పని చేశానా అని బాధపడ్డాను నేను.

ప్రతి మగాడూ తనో హీరో అనుకుంటాడు. ఆ అహానికి ప్రాణం పోస్తుంది భార్య ప్రవర్తన. ఈ కంప్యూటర్ నా భార్యముందు నా పరువు తీ సేస్తోంది.

తర్వాత కంప్యూటర్‌ని రకరకాల పరీక్షలకు గురిచేశాను. రాజకీయ నాయకుల ఉపన్యాసాల్నీ, రేడియోలో వార్తల్నీ, తెలుగు సినిమా కథల్నీ, ఆర్టీసి బస్సుల వ్యవహారాన్నీ- ఇలా ఒకటేమిటి- అన్నిటికీ 'ఇల్లాజికల్' అని ఒక్కటే గోల.

ఇలా నాలుగైదు రోజులు గడిచాయి. ఆఫీసులో గొప్ప మార్పు వచ్చేసింది. ఇంతకాలం నరసింహం మమ్మల్ని అకారణంగా తిడుతూండేవాడు. ఇప్పుడది మానేశాడు. అలా అని మాకు తిట్లూ తప్పడం లేదు. ఏదో కారణంగా ఎవరినో ఒకరిని తిట్టకపోతే ఆయ నుండలేడు. అందుకని తిట్టడానికి అసలైన కారణాలే పట్టసాగాడు.

ఆఫీసుకు ఒక్క సెకను కూడా లేటుగా రాకూడదు. బయటకు వెళ్ళడానికి పర్మిషన్ అడక్కూడదు. ఆఫీసులో ఉండగా ఆయన పిలిస్తే తప్ప సీటు కదలకూడదు. ఒకరితో ఒకరు మాట్లాడకూడదు. డ్రాఫ్టుల్లో ఒక్క స్పెల్లింగ్ మిస్టేక్ కూడా ఉండకూడదు. ఏ పనీ పెండింగు ఉంచకూడదు. రోజు కింత పని అని కచ్చితంగా చేయాలి.

ఇవన్నీ మాకల్ల కావు. సుఖంగా ఉద్యోగం చేయడానికి అలవాటుపడ్డాం. ఇప్పుడు నరసింహం మిమ్మల్ని తిడుతూంటే కంప్యూటర్ కూడా ఆయన్ని సమర్థిస్తోంది. గతంలో ఆయన తిట్టాడన్న బాధ తప్పితే తిట్లకు బాధ కలిగేది కాదు. ఇప్పుడు మమ్మల్ని ఆ తిట్లే బాధిస్తున్నాయి.

అంతా కలిసి ఆలోచించుకుని నరసింహం దగ్గరకు వెళ్ళి-"అయ్యా! మీరు అధికారి. మీరు అనదగ్గవారు. మేము పడదగ్గవారం. మన మధ్య న్యాయాన్యాయాల విచారణ అనవసరం. మనకీ కంప్యూటర్లు వద్దు. ఎప్పటిలాగే ఉందాం" అన్నాం.

"మీరు నాపై ఫిర్యాదును ఉపసంహరించుకుంటామంటే నేను పై అధికారులకు రాసి ఈ విషయమై అనుమతి తీసుకుంటాను..." అన్నాడు నరసింహం.

అందు కంతా అంగీకరించాం. ఆ రోజు నే నింటికి వెళ్ళేసరికి అయిదేళ్ళ బాబాయి వచ్చాడు. ఆయనకు కంప్యూటర్ గురించి తెలిసింది. తన విజయావకాశాల గురించి కంప్యూటర్ ద్వారా తెలుసుకోవా లనుకుంటున్నా డాయన.

"దేశంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలందరి ఆలోచనలూ ఈ కంప్యూటర్లో ప్రవేశపెట్టబడ్డాయి. ఇది మీ విజయావకాశాల్ని తప్పక చెప్పగలదు" అన్నాను.

ఆయన ఆ కంప్యూటర్ ఆన్‌చేసి తన గురించీ, ప్రత్యర్థి గురించీ, తన ప్రచారం, తన ప్రత్యర్థి ప్రచారం గురించీ చెప్పి- 'మాలో ఎవరు నెగ్గుతారో చెప్ప'మని రీజన్ బటన్ నొక్కాడు. కంప్యూటర్ అయిదేళ్ళ బాబాయే నెగ్గుతాడని చెప్పింది. ఆయన చాలా సంతోషంగా-"నేను నెగ్గడానికి కారణ మేమిటి?" అని మళ్ళీ అడిగాడు.

"ఇల్లాజికల్!" అంది కంప్యూటర్ వెంటనే.

ఆయన కంప్యూట ర్నింకే ప్రశ్నలూ వేయలేదు.

మర్నా డుదయం శ్రీమతి, పాలవాడు ఘర్షణ పడుతున్నారు.

పాలు పల్చగా ఉంటున్నాయనడానికి బదులు శ్రీమతి పాలలో నీళ్ళు ఎక్కువ కలుపుతున్నావంటని వాడి క్కోపం వచ్చింది.

ఉన్న మాటంటే ఎవరికైనా ఉలుకే మరి!

'ఆడవారి మాటలకు అర్థాలే లేవులే' అని కంప్యూటరంటే శ్రీమతికీ, ఆమె మిత్రమండలికీ ఆగ్రహం వచ్చింది. బాసు మమ్మల్ని సకారణంగా కాక అకారణంగా తిడితేనే మంచిదని నాకనిపిస్తోంది. ఉన్న మాటని తెలిసేకనే నేనాఫీసులో పని చేయనని ఎవరైనా అంటే నాకులుకు వస్తోంది. ఉన్న మాట తెలిసేక మేమంతా మమ్మల్ని మేము సంస్కరించుకున్నామా?

ఏ నాయకు డెన్నికల్లో నెగ్గుతాడో కంప్యూటర్ చెప్పగలిగింది. ఎందుకు నెగ్గుతాడంటే 'ఇల్లాజికల్!' అంది. ఇది మన ప్రజల గురించిన ఉన్న మాట!

ఇది తెలిసి వాళ్ళేం చేస్తారు?

నాలాంటి వాళ్ళంతా కలిసి ప్రజలు. ఆ ప్రజల్లోనే నొకడిని. మాది అవినాభావ సంబంధం.

శ్రీమతి ఇంకా పాలవాడితో ఘర్షణ పడుతూనే ఉంది.